గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించండి : కలెక్టర్

కడప : గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సభా భవన్ నుంచి జెసి జి.గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యాలతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, అభివృద్ధి పనులుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ .ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ. నిబద్ధతతో పని చేయాలన్నారు. లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారమూ ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పెండింగ్ లేకుండా మంజూరు చేయాలన్నారు.

వైసిపిలో ఉత్కంఠ!

అవినాష్ అరెస్టుపై మధ్యంతర ఉత్తర్వులు రద్దు
సిబిఐ దర్యాప్తు తీరుపై అందరి దృష్టి
ఎంపీ టికెట్‌పై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపిలో ఉత్కంఠ నెలకొంది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయవద్దంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీం కోర్టు సోమవారం రద్దు చేసిన సంగతి తెలిసిందే. సుప్రీం ఉత్తర్వుల నేపథ్యంలో జిల్లా నుంచి పెద్దఎత్తున ఎంపీ అనుచరులు హైదరాబాద్‌లోని ఎంపీ ఇంటికి చేరుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు అవినాష్ తండ్రి భాస్కర్‌రెడ్డి, ఎంపీ అనుచరుడైన ఉదయ్‌కుమార్‌రెడ్డిని ఆరు రోజులుగా కస్టడీలోకి తీసుకుని సిబిఐ విచారించింది. ఈ నెల 29 వరకు వైఎస్.భాస్కర్‌రెడ్డి, 26న ఉదయ్‌కుమార్‌రెడ్డి కస్టడీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో కస్టడీలో హత్య కేసుకు సంబంధించి ఎలాంటి ప్రశ్నలు సంధించి, ఎలాంటి సమాధానాలు సిబిఐ రాబట్టుకుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయడంపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను సుప్రీం కోర్టు రద్దు చేసిన వార్తల నేపథ్యంలో సిబిఐ దర్యాప్తు వ్యవహారం ఎలా ఉంటుందనే అంశంపై అందరి దృష్టి నిలిచింది. ఏప్రిల్ నెలాఖరు నుంచి జూన్ నెలాఖరు నాటికి వివేకా హత్య కేసు విచారణను పొడిగించిన నేపథ్యంలో రాజకీయంగా లాభ నష్టాలను పార్టీలు బేరీజు వేసుకోవడం కనిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ఆర్నెళ్లు ముందు అవినాష్‌రెడ్డిని అరెస్టు చేస్తే రాజకీయంగా వైసిపికి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి కడప పార్లమెంట్ బరిలో నుంచి ఎవరిని నిలుపుతుందనే అంశంపై చర్చ నడుస్తోంది. ఇప్పటికే పులివెందులకు చెందిన కొందరి బంధువుల పేర్లు, కడపకు చెందిన ముఖ్యమంత్రి సమీప బంధువుల పేర్లు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా వివేకానందరెడ్డికి ప్రజలు, నాయకులతో విస్తృత పరిచయాలు ఉన్న సంగతి తెలిసిందే. ఆయన తర్వాత వైసిపిలో అవినాష్‌రెడ్డికి మంచి పరిచయాలు కలిగిన నాయకునిగా గుర్తింపు ఉంది. వివేకా హత్య కేసులో అవినాష్ అరెస్టయితే అధికార వైసిపి తరుపున ఎవరిని పార్లమెంటు బరిలో నిలుపుతుందనే అంశంపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

పులివెందులలో సిబిఐ బృందం నిఘా

పులివెందులలో టెన్షన్.. టెన్షన్..
- నిఘా పెట్టిన సిబిఐ

ప్రజాశక్తి పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో సంబంధించి కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డికి హైకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్, ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేయడంతో పులివెందులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. సోమవారం సిబిఐ అధికారులు పులివెందులలో పలు ప్రాంతాలను పరిశీలించారు. అవినాష్‌రెడ్డిని అరెస్టు చేస్తే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో దానిపై సిబిఐ దృష్టి సాగించినట్లు తెలుస్తుంది. మరోమారు పులివెందులలో సిబిఐ అధికారులు ఎవరిని విచారించకపోవడంతో నిఘా పెట్టిందని తెలుస్తుంది. సుప్రీం కోర్టు తీర్పుతో సిబిఐకి అవినాష్‌ను అరెస్టు చేయడానికి అడ్డంకులు తొలగిపోవడం వల్ల ఏ సమయంలోనైనా అవినాష్‌తోపాటు మరికొంత మందిని సిబిఐ అరెస్టు చేస్తుందన్న టెన్షన్ పులివెందులలో కనిపిస్తుంది. అవినాష్‌రెడ్డిని అరెస్టు చేస్తే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు పట్టణంలో అదనపు బలగాలు ఏర్పాటు చేసే ఆలోచనలో పోలీసులు ఉన్నట్టు తెలుస్తుంది.

'ఇఎస్ఐ'లో అరకొర వైద్యం

- నెలనెలా కార్మికుల వేతనాల్లో కోత
- రక్త పరీక్షలకు నోచని వైనం
- వేధిస్తోన్న సిబ్బంది కొరత
- అటకెక్కిన వైద్య పరికరాలు
- పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఇఎస్ఐ ఆస్పత్రిలో కార్మికులకు వైద్యం పూర్తి స్థాయిలో అందడం లేదు. ఒక వైపు మందులు, మరోవైపు సిబ్బంది కొరత వల్ల వైద్యం కోసం వెళ్లే కార్మికులకు అరకొర వైద్యం అందుతోంది. ఎర్రగుంట్ల పరిసరాల్లో ఐదు కర్మాగారాలున్నాయి. ఎర్రగుంట్ల ఇఎస్ఐ పరిధిలో దాదాపు 8800 మంది కార్మికులున్నారు. కార్మికుల జీతం నుంచి ప్రతినెలా నాలుగు శాతం ఇఎస్ఐకి జమవుతుంది. కార్మికుల జీతాల నుంచి లక్షల్లో జమ అవుతున్నా వారికి సరైన వైద్యం, సదుపాయాలు అందించడంలో ఇఎస్ఐ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ఇక్కడి ఇఎస్ఐ ఆసుపత్రిలో షుగర్, మలేరియా, టైఫాయిడ్ వంటి వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాలున్నా ల్యాబ్ టెక్నీషియన్స్ లేకపోవడంతో లక్షలు విలువ గల వైద్య పరికరాలు వృథాగా ఉన్నాయి. ఇటువంటి వైద్య పరీక్షలు లేకపోవడంతో చాలామంది కార్మికులు ఆసుపత్రికి రావడమే మానేశారు. ఇక్కడ పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ మూడేళ్ల కిందట ఒక మంత్రి సిఫార్సుతో బదిలీ చేయించుకొని వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ఒక్క ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా ఇక్కడ నియమించలేదు. కార్మికులు విధిలేక ప్రయివేట్ ల్యాబ్‌లలో రక్త, షుగర్ పరీక్షలు చేయించుకుంటున్నారు. దీంతో కార్మికులు ఇఎస్ఐకి డబ్బులు కడుతూ, ప్రయివేట్ ల్యాబ్‌లలో వేలకు వేలు ఖర్చు చేసి పరీక్షలు చేయించుకుంటూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇఎస్ఐలో సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒకరే వైద్యం అందిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, స్వీపర్, వాచ్మెన్, ఎంఎన్‌ఒలు లేకపోవడంతో అక్కడికి వచ్చిన కార్మికులకు సరైన వైద్యం అందించలేకున్నారు. ఫార్మసిస్ట్ కూడా వారానికి నాలుగు రోజులు మాత్రమే పని చేస్తున్నట్లు సమాచారం. సమస్యపై పలుమార్లు జిల్లా అధికారులను, స్థానిక ఎమ్మెల్యేని కలిసి పరిస్థితిని వివరించినా పట్టించుకోవడం లేదని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే స్వతహాగా డాక్టర్ అయి ఉండి కూడా వైద్యానికి సంబంధించిన సమస్యలపై పట్టించుకోకపోవడం ఏంటని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఇన్ని వేల మంది కార్మికులకు సరైన వైద్యం అందేటట్లు చర్యలు తీసుకోవాలని ఈఎస్ఐ అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.

షుగర్ పరీక్షకూ దిక్కులేదు

ఇఎస్ఐలో కార్మికుల జీతాల నుంచి డబ్బులు జమ చేసుకుంటున్నా కనీసం షుగర్ పరీక్షకు కూడా దిక్కులేదు. దీనివల్ల మేము ప్రయివేట్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వేతనాల్లో వైద్యం కోసం డబ్బులు తీసుకుంటున్నా మళ్లీ ప్రయివేట్‌గా పరీక్షలు చేయించుకోవాలంటే ఎలా? ఆర్థికంగా నష్టపోతున్నాం. వెంటనే ల్యాబ్ టెక్నీషియన్ ఏర్పాటు చేయాలి.

- రాజు, కార్మికుడు, ఎర్రగుంట్ల

సిబ్బంది కావాలని పలుమార్లు కోరాం

ఎర్రగుంట్ల ఇఎస్ఐలో సిబ్బంది కొరత ఉండడం వాస్తవమే. సిబ్బంది కావాలని పలుమార్లు జేడీని కోరాం.. స్థానిక ఎమ్మెల్యేను కూడా కలిసి సిబ్బంది కొరత గురించి వివరించాం.

- డాక్టర్ సూర్య ప్రకాశ్ రెడ్డి, ఇఎస్ఐ వైద్యులు, ఎర్రగుంట్ల.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : మే 6,7 న బద్వేలు పట్టణంలో డివైఎఫ్ఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, వాటిని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలులో నిర్వహించబోయే రాజకీయ శిక్షణా తరగతులకు జిల్లా వ్యాప్తంగా ఉన్న డివైఎఫ్ఐ నాయకత్వం, రాష్ట్ర నాయకులు హాజరు అవుతారన్నారు. శిక్షణా తరగతులలో నిరుద్యోగ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకశాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ముఖ్యంగా డిఎస్‌సి, గ్రూప్- 2 నోటిఫికేషన్లు లేవరన్నారు. నిరుద్యోగ యువత ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో లక్ష రూపాయలు ఖర్చు చేసుకుంటూ వయో భారంతో సతమతం అవుతున్నారన్నారు. కడప ఉక్కు పరిశ్రమ పై కేంద్రం శీతకన్నుతో వ్యవహరిస్తూ ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇంత అన్యాయానికి ఒడిగట్టిన కేంద్ర ప్రభుత్వం పై రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంటులో ఒక్క మాట కూడా మాట్లాడలేదని వాపోయారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం. ఓబులేసు,మజిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, రెబ్బా నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సమాజ సేవ చేయాలి

కడప : విద్యార్థి దశ నుండే సమాజసేవ చేసేందుకు ఎన్ఎస్ఎస్ చక్కగా ఉపయోగ పడుతుందని ఎన్ఎస్ఎస్ పిఒ అంకాల నాగరాజు అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 స్పెషల్ క్యాంపు సోమవారం నిరంజన్ నగర్‌లో నిర్వహించారు. ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజ సేవ చేయడానికి విద్యార్థులకు చక్కని అవకాశమని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ పిఒ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సమాజసేవ చేయడానికి ఎన్ఎస్ఎస్ చక్కగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రత పరిశుభ్రత పై ర్యాలీ నిర్వహించినారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్

గ్రామీణ రోడ్లకు మహర్దశ

ప్రజాశక్తి -పోరుమామిళ్ల టౌన్

రాష్ట్రంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ రానుందని రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణ అభివృద్ధి సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. పోరుమామిళ్ల మండలంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న గ్రామీణ రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ జగనన్నపాలనలో వస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు కేటాయించిన నిధుల్లో భాగంగా పోరుమామిళ్ల మండలంలోని చెన్నారెడ్డిపేట నుంచి పులివీడు వరకు, కాలువ కట్ట దగ్గర నుంచి రామాయపల్లి వరకు 1.20లక్షల రూపాయలతో నూతనంగా రోడ్లు వేయనున్నట్లు తెలియజేశారు. పనులు చేపట్టడం కోసం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి రోడ్లను అయన పరిశీలించారు.

రోడ్లను పరిశీలిస్తున్న నాగార్జునరెడ్డి

నాడు ప్రథమం.. నేడు అథమం

కడప : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంచాయతీరాజ్ అవార్డుల్లో నాడు ప్రథమం నేడు ఆథమం అని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాసారికృష్ణ అన్నారు. సోమవారం తన సొంత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సందర్భంగా పంచాయతీ రాజ్ సంస్థల ప్రజా ప్రతినిధులు అందరికీ మొదట గా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు స్వర్ణయుగం కాగా, వైసిపి పాలన చీకటి యుగం అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నారా లోకేష్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి గ్రామాల స్వరుపాన్నే మార్చారన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో గ్రామాలలో దాదాపు 25 వేల కిలోమటర్ల మేర సిమెంట్ రోడ్లు వేశారు.దాదాపు 30 లక్షల ఎల్ ఈ డి బల్బులు ఏర్పాటు చేశారన్నారు. వైసిపి ప్రభుత్వంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం కూడా లేదన్నారు.

మాట్లాడుతున్న వికాస్ హరికృష్ణ

మోడీని గద్దెదింపి దేశాన్ని కాపాడండి

సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరి బహిరంగ సభలో నాయకుల పిలుపు

అభివాదం తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రదాని మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మోడీ విధానాలకు నిరసనగా నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక శివాలయం సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో పక్కనున్న కేరళ రాష్ట్రంలోని సిపిఎం ప్రభుత్వం ప్రజలను అన్ని రకాలుగా ఆదుకుంటే మోడీ ప్రభుత్వం మాత్రం రూ. వెయ్యి ఇచ్చి చేతులు దులిపేసుకుందన్నారు. చివరకు విశాఖస్టీల్ ప్లాంట్‌ను అమ్మ కానికి పెట్టిందని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నారు. దేశ సంపదలో భాగస్వామ్య మవుతున్న శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా మోడీ విధానాలు న్నాయన్నారు. ఎన్నికల ముందు ప్రజామద్దతు కోసం అనేక వాగ్దానాలిచ్చిన మోడీ అన్నిటినీ తుంగలో తొక్కారని వివరించారు. నోట్ల రద్దు వల్ల సాధించి ఒదేమీలేదన్నారు. మోడీ చాయ్‌ని అమ్మినంత సులభంగా ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్ముతున్నారని అన్నారు. అంబానీ, అదానీలను అపరకుబేరులను చేసేం దుకు దేశాన్ని అమ్మకానికి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా విమర్శి ంచారు. పెట్రోల్, డీజల్ ధరల పెరుగుదలలో కేంద్రం తగ్గడం లేదని పేర్కొన్నారు. ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్యుడి నడ్డి విరిగిపోతుందని వాపోయారు. సామాన్యుడు కష్టంతో డబ్బులను బ్యాంకులలో కూడబెట్టుకుంటే వీటిని కాజేసిన లలిత్‌మోడీ, నీరవ్‌మోడీ, విజయ్‌మాల్యా లాంటి వాళ్లకు మోడీ రెడ్‌కార్పెట్ పరిచారన్నారు. ప్రధాని మోడీ పాలకుడు కాదు వ్యాపారి అన్నారు. మోడీ ఒకవైపు వ్యాపారం మరోవైపు మనువాదం తెచ్చి మనుషుల మధ్య వైష మ్యాలను సృష్టిస్తున్నారని చెప్పారు. మోడీని గద్దె దించకపోతే భవిష్య త్తు అంధకారం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, పట్టణ కార్యదర్శి సుబ్బ రాయు డు, ఐద్వా నాయకురాలు సుబ్బమ్మ, ఏపి మహిళా సమాఖ్య నాయకు రాలు సుబ్బమ్మ, సిపియం పట్టణ కార్యదర్శి పక్కీరప్ప, కార్మిక సంఘ నాయకులు సాల్మన్, చంటి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

29న ప్రచార భేరి, బహిరంగ సభను జయప్రదం చేయండి

కడప అర్బన్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రచారభేరి నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈనెల 29న నగరంలో ప్రదర్శన, సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ తెలి యజేశారు. సోమవారం నగరంలోని సిపిఎం కార్యాల యంలో ప్రచార బేరి ప్రదర్శన, సభా కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రదర్శన ప్రారంభ మవుతుందని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు ఐటిఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్య అతిధులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేసు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ వి. ఉమామహేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగణపల్లి చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పారుక్ హుస్సేన్, చంద్రారెడ్డి, ఓబులేసు, సిపిఐ సహాయ కార్యదర్శి బాదుల్లా, మద్దిలేటి, నగర కమిటీ సభ్యులు రాజమణి, సునీల్, నగర కార్యవర్గ సభ్యులు సావంత్ సుధాకర్, భాగ్యలక్ష్మి, నారాయణ, వలరాజు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని ప్రొద్దుటూరు త్రీ టౌన్ పీఎస్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలోని అల్లూరి సీతా రామరాజు జిల్లాకు చెందిన ప్రధాన నిందితుడు మర్రి సిద్దు అలియాస్ రాజును పోలీసులు సోమవారం అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో సమీపంలోని ఏజెన్సీ ఏరియాలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న మర్రి సిద్దు అనకాపల్లికి చెందిన మరో ఇద్దరు స్మగ్లర్లు కామరాజు, నాగేశ్వరరావును పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. వీరి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఈకేసులో నిందితులుగా ఉన్న ఏడుగురిని గతంలో అరెస్టు చేశారని పేర్కొన్నారు. సిద్దు ఏకంగా గంజాయి పండిస్తూ ఉన్నాడని తెలిపారు. గంజాయి సాగు, అక్రమ రవాణా చేసిన పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసుల విచారణలు మరిన్ని వివరాలు బయటకు వస్తాయని చెప్పారు. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారిని పునరావాస కేంద్రాలకు పంపుతున్నామని పేర్కొన్నారు. విద్యా సంస్థల వద్ద మహిళా పోలీసులతో నిఘా పెట్టామని తెలిపారు. ప్రజలు గంజాయి విక్రయాలు, వినియోగించే వారి సమాచారం డయల్ 100 లేదా ఎస్‌పి ఫోన్ నంబర్ 9440796900 కు ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అదనపు ఎస్‌పి (అడ్మిన్) తుషార్ డూడి, ప్రొద్దుటూరు ఎఎస్‌పి ప్రేర్నా కుమార్ పర్యవేక్షణలో గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి, స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాజా ప్రభాకర్, ప్రొద్దుటూరు త్రీ టౌన్ సిఐ నారాయణ యాదవ్, యస్ఐ కృష్ణంరాజు నాయక్, సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందచేశారు.

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వా లని టిడిపి నగర ఉపా ధ్యక్షుడు కొండా సుబ్బయ్య, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి కోరారు. సోమవారం రాయల్ కరీముల్లా ఆధ్వర్యంలో రాష్ట్రపతికి పోస్టు కార్డులు పంపించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ భారత రత్నకు తారక రామారావు అర్హులని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి భార తరత్న ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కార్డులు పోస్టు చేస్తున్న టిడిపి నాయకులు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్వాడీ స మస్యలు పరిష్కరించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్పం దన కార్యక్రమంలో జెసి గణేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బి.మనోహర్, బి.లక్ష్మిదేవి మాట్లాడుతూ కమలాపురం ప్రాజెక్టు ఎర్రగుంట్ల మండ లంలో మాలేపాడు సెంటర్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ రిటైర్డ్ అయిం దన్నారు. అదే సెంటర్లో పనిచేస్తున్న హెల్పర్‌కు టీచర్‌గా ప్రమోషన్ ఇవ్వాలని జీవో ఉన్నా ఇవ్వలేని పేర్కొన్నారు. కమలాపురం సిడిపిఒ ప్రాజెక్ట్ ఆఫీసులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్య ఇంకొకరికి ప్రమోషన్ ఏ రకంగా ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లాలో ఇంతవరకు రిటైర్మెంట్ అయిన టీచర్ స్థానంలో ఆయాకు ప్రమోషన్ ఇచ్చేవారని, కానీ అందుకు విరుద్ధంగా సీనియర్ అసిస్టెంట్ ఈశ్వ రయ్య లాలూచీపడి మరొకరి ఇచ్చారని జెసికి ఫిర్యాదు చేశారు. ఐసిడిఎస్ పీడీని పిలిపించి విచారించి రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా కడప అర్బన్ ప్రాజెక్టులో కేంద్రాల మార్పువల్ల కార్యకర్తలపై అదనపు పనిభారం పెరుగుతుందని వివరించారు. అంగన్వాడీ సమస్యలపై రిపోర్ట్ ఇవ్వమని ఐసిడిఎస్ పీడీకి జెసి ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

జెసికి సమస్యను విన్నవిస్తున్న నాయకులు

26వ సారి రక్తదానం

ప్రజాశక్తి- కడప అర్బన్

బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సంస్థ వ్యవ స్థాప కులు పట్టుపోగుల పవన కుమార్ సోమవారం రిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 26వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రజలకు రక్తదాన కరప త్రాలు పంచి అవగాహన కల్పించారు. 12 మంది యువత చేత స్వచ్ఛందంగా రక్తదానం చేయించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.యం.ఓబులేష్, రిమ్స్ బ్లడ్ బ్యాంకు వైద్య లు డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి, సిస్టర్ శారదా, టెక్నిషన్ హరి భాస్కర్ రెడ్డి, కన్నా, పుల్ల య్య, హరి, ఈశ్వర్, బ్లడ్ టు లివ్ సభ్యులు రవితేజ యాదవ్, కిరణ్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న పట్టుపోగుల పవన్‌కుమార్

సర్వే ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయి

ప్రజాశక్తి -కడప

మెగా సర్వే లో వస్తున్న ఫలి తాలు ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి అంజా ద్‌బాష అన్నారు. సోమ వారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఏప్రిల్ 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించినట్లు చెప్పారు.7 లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించారని అన్నారు. ప్రజలు తమ భవిష్యత్తు కోసం ఎవరిని విశ్వసిస్తున్నారనే అంశంపై వారి అభిప్రాయాలను ప్రజా మద్దతు నమోదు చేసినట్లు తెలిపారు. మధ్యంతర ఫలితాల నివేదికను మీడియా ముఖంగా వెల్లడిస్తున్నట్టు తెలిపారు. .మెగా సర్వేలో భాగంగా కడప నియోజకవర్గంలో 85 వేల గృహాల్లో కుటుంబాలను సందర్శించినట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో మిగిలిన వాటిని సందర్శించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం అన్నారు. కుల, వర్గ, రాజకీయాలకు అతీతంగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ ఇవ్వడం ద్వారా ప్రజలు సీఎం జగనన్న పై తమ విశ్వాసం వ్యక్తం చేశారని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని ప్రభుత్వ స్థలాల సమస్యలను చట్టప్రకారం పరిష్కరించి నిజమైన లబ్ధిదారుల క్రమబద్ధీకరణకు ప్రణాళిక సిద్ధం చేశామని బద్వేల్ ఆర్‌డిఒ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదిగా నిర్వహించిన సమగ్ర సర్వేలో సుమారు 30 వేలకు పైగా నివాస స్థలాలు, డికెటి భూములను ప్రత్యేక చట్టం ద్వారా క్రమబద్ధీకరణ చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి దశలో 11 వేల స్థలాలను క్రమబద్ధీకరిస్తామని, అభ్యంతరాలు ఉండే స్థలాలలో నిర్మించిన కట్టడాలను తొలగిస్తామని చెప్పారు. బాధ్యతలు తీసుకున్న రోజు నుంచి నేటి వరకు బద్వేలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశామని తెలిపారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముద్దనూరు

సాగు, తాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ ఎంపిపి మునిరాజా రెడ్డి అన్నారు. మండలంలోని కాండ్లోపల్లి గ్రామం వద్ద జిఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ నుండి 4,360 కిలోమీటర్లు రూ.6 కోట్ల 30లక్షలతో ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పైపులైన్ పనులను సోమవారం మునిరాజారెడ్డి, ఇరిగేషన్ డిఇ వాసుదేవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహాయ సహకారాలతో ఆకుతోటపల్లి, పూల చెరువు, పెద్దచెరువులకు నీరు నింపేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎల్ఆర్ కంపెనీ పైపులైన్ పనులు చేస్తున్నట్లు చెప్పారు. రైతుల చిరకాల కల నెరవేరుస్తున్న ముఖ్యమంత్రికి, ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి రుణపడి ఉంటామని రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఉప ఎంపిపి రేణుకా, సర్పంచు జయరాం నాయుడు, నాయకులు వీర ప్రతాప్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి

ఎర్రగుంట్లలో ఉచిత మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక బస్టాండ్ ఆవరణలో కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం అధ్యక్షులు చంద్రగిరి రెడ్డయ్య, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు వడదెబ్బ తగలకుండా దాహం తీర్చేందుకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల మొదటి వారం నుండి తమ సేవా సంస్థ తరపున ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు సేవా సంస్థను అభినందించారు.

ఉచిత మజ్జిగ పంపిణీలో సేవా సంఘం సభ్యులు

కొనసాగుతున్న ఉచిత మజ్జిగ పంపిణీ

పులివెందుల రూరల్ : స్థానిక గాంధీ సర్కిల్ వద్ద 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ పంపిణీ చేస్తున్న ఉచిత మజ్జిగ కార్యక్రమం 19 రోజులుగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మునిసిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి సౌజన్యం, మాతృమూర్తి పార్నపల్లి బాలమ్మ జ్ఞాపకార్థం డాక్టర్ ఇసి గంగిరెడ్డి మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మజ్జిగ, మంచినీరు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

26లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో తల్లి, తండ్రిలో ఒకరి ఆదరణలేని 18 సంవత్సరాల లోపు వారికి కేంద్ర ప్రభుత్వం ప్రతి నెల రూ.4 వేల ఆర్థికసాయం అందించే పథకం మిషన్ వాత్సల్య పథకానికి ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం దరఖాస్తులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 26 వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు అనుమతి ఉందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, జిఎంఎస్‌కెలు అర్హులైన వారి దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారని తెలిపారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను పరిశీలన చేసి ఆన్‌లైన్ చేశామన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ, జిఎం ఎస్‌కెలు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న సిడిపిఒ సావిత్రమ్మ

బాబు పర్యటనను అడ్డుకోవడం సిగ్గుచేటు

జమ్మలమడుగు రూరల్ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడం సిగ్గుచేటని పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో చంద్రబాబు పర్యటన అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. జెడ్ కేటగిరిలో ఉన్న ప్రతిపక్ష నాయకుడి పర్యటనను మంత్రి ఆది మూలపు సురేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు రాళ్ల దాడి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో బూసిరెడ్డి, మద్దకం భాస్కర్, మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

క్రైం కార్నర్

అవమానించాడనే హత్య : డిఎస్‌పి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిర్రాజుపల్లి గ్రామంలో గొడ్డు మురళి అనే వ్యక్తి హత్యకు సంబంధించి శేఖర్, అశోక్ అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి నాగరాజు తెలిపారు. మురళి అనే వ్యక్తి శేఖర్ భార్య సుబ్బమ్మను తరచూ అవమాన పరుస్తూ మాట్లాడడంతో చంపి, శవాన్ని కాల్చిన సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం వంగనూరు గ్రామానికి చెందిన గొడ్డు మురళి ఎర్రగుంట్ల మండలంలోని చిర్రాజుపల్లిలో 25 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. ఆ క్రమంలో పండ్ల వ్యాపారం చేసుకునే చిలమకూరు గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తితో పరిచయమైంది. శేఖర్ భార్య సుబ్బమ్మతో చనువుగా ఉండేవాడు. దాదాపు ఆరు సంవత్సరాల నుండి చిలమకూరు గ్రామంలో ముగ్గురు కలిసి ఒకే ఇంట్లో జీవించేవారు. అయితే సుబ్బమ్మ మురళీని కాదని భర్త శేఖర్ బంధువైన అశోక్‌తో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో మురళీ వారిని తిడుతూ అవమాన పరిచేలా మాట్లాడేవాడు. ఇది భరించలేక మురళీని శేఖర్, అశోక్ ఈ ఏడాది మార్చి 26న హత్య చేసి, శవాన్ని కాల్చినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 23న తోట యజమాని చిర్రాజుపల్లి మాధవరెడ్డి తన కౌలు రైతు మురళి కనిపించడంలేదని ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ కృష్ణయ్య గ్రామంలోని వ్యక్తులను మురళి ఆచూకీని విచారించినట్లు తెలుసుకొని, భయంతో నిందితులు చిలమకూరు విఆర్ఒ మునెన్న వద్ద లొంగిపోయారు. అనంతరం విఆర్ఒ మునెన్న నిందితులను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు మాట్లాడుతూ ఈ హత్యకు సంబంధించి శేఖర్, అతని భార్య సుబ్బమ్మ, అశోక్ ముగ్గురిని నిందితులుగా పేర్కొని అరెస్టు చేశామన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి నాగరాజు

పర్యాటకులను ఆకర్షిస్తున్న చిత్రావతి

- జల విహారానికి నాలుగు పడవలు, ఆహ్లాదాన్నిస్తున్న పార్క్, రెస్టారెంట్

చిత్రావతి ప్రాజెక్టు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం పార్నపల్లి గ్రామ సమీపంలో ఉన్న పెంచికల బసిరెడ్డి చిత్రావతి ప్రాజెక్టుకు పర్యాటక శోభ సంతరించుకుంది. గతంలో ఇక్కడ దాదాపు రూ.5.6కోట్లతో అభివృద్ధి చేశారు. చిత్రావతి నదిలో పర్యాటకుల వినోదం కోసం నాలుగు పడవలు, ప్రత్యేక ఆకృతులతో ఆహ్లాదకరంగా పార్కు, సమావేశ మందిరం, రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. గతేడాది డిసెంబర్ నెలలో నూతనంగా ఏర్పాటు చేసిన వీటిని సిఎం ప్రారంభించారు. దీంతో చిత్రావతి పర్యాటకంగా ఆకర్షిస్తోంది.

ప్రజల వివరాల మేరకు చిత్రావతి ప్రాజెక్ట్ చరిత్ర:

వైఎస్ఆర్, అనంతపురం జిల్లాల సరిహద్దు ప్రాంతం లింగాల పార్నపల్లి సమీపంలో చిత్రావతి ప్రాజెక్టును నిర్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో ఆరు టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఆరు నుంచి పది టీఎంసీలకు పెంచి 2006 ఆగస్టులో గేట్ల నిర్మాణంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ జిల్లాలో పుట్టి వైఎస్ఆర్ జిల్లా గండికోట సమీపంలోని పెన్నా నదిలో చిత్రావతి నది కలుస్తుంది. పెన్నా నదికి ఉపనదిగా కూడా పిలుస్తారు. ఒకప్పుడు జీవనదిగా ఉన్న చిత్రావతి నది కాలక్రమేణా వర్షాభావ పరిస్థితుల కారణంగా.. వర్షాకాలంలో మాత్రమే నది ప్రవహిస్తుంది. ఈ చిత్రావతి ప్రాజెక్టుకు ఎగువనున్న తుంగభద్ర జలాశయం నుంచి 4.4 టీఎంసీల నీటికోట రావాల్సి ఉంది. చిత్రావతి నది నుంచి పిబిసి ద్వారా పులివెందుల నియోజకవర్గం పరిధిలో 117 గ్రామాలకు దాదాపు సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా తుంగభద్ర జలాశయంలో పూడిక నెపంతో చిత్రావతికి రెండు టీఎంసీల నీటి వరకే కుదించారు. అవి చిత్రావతి చేరే కొద్ది అర టీఎంసీ నీరు మాత్రమే ఉంటుంది. దీంతో కేవలం తాగునీటి అవసరాల కోసం మాత్రమే చిత్రావతి ఉపయోగపడుతూ వచ్చింది. కాలంకలిసి రావడంతో చిత్రావతికి మహర్దశ పట్టింది. వైఎస్ తనయుడు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత చిత్రావతికి 10 టిఎంసిల నీరు చేరింది. దీంతో ఊటల ద్వారా పులివెందుల నియోజ కవర్గం లోని లింగాల, పులి వెందుల, వేముల, వేంపల్లి మం డలాల్లో వంకలు వాగులు ప్రవ హిస్తూనే ఉన్నాయి. చిత్రావతి లో నీరు సమృద్ధిగా ఉండడంతో ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యాటక రంగంపై ప్రత్యేకదృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఇక్కడ భావితరాల వారికి చక్కటి ఆనం దాన్ని, వినో దాన్ని, ఆహ్లా దాన్ని అందించేలా పర్యాటక రం గానికి అధిక ప్రాధాన్య తనిచ్చారు. కడప జిల్లా వాసులే కాకుండా అనంతపురం జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులతో చిత్రావతికి వచ్చి బోటుల్లో షికారు చేస్తున్నారు. దీంతో చిత్రావతిని పర్యటక కేంద్రంగానూ తీర్చిదిద్దారు.

బోటు షికారుకు సిద్ధంగా ఉన్న పర్యాటకులు

ఎకో పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణ సమీపంలోని ఎర్రగుంట్ల రోడ్డులో ఉన్న రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎకో పార్క్ అభివృద్ధికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి రూ.కోటి విరాళం ప్రకటించారు. ఆ మేరకు అటవీ శాఖ, పార్కులోకి వస్తున్న వాకర్స్ అసోసియేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారితో సోమవారం ఆయన సమావేశమై పార్కుకు కావలసిన వసతుల నిమిత్తం ఆ విరాళం ప్రకటించారు. అక్కడికి వచ్చే ప్రజలకు అన్ని విధాలా సౌకర్యాలతో కూడిన అంశాలను డిఎఫ్ఒ సందీప్‌రెడ్డి, డిప్యూటీ డిఎఫ్ఒ దివాకర్ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే మొదటి విడతగా రూ.50 లక్షలు.. ఆ పనులు పూర్తవగానే రెండో విడతగా మరో రూ.50 లక్షలు ఇస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్కుకు వచ్చే వారి నెవరినీ రూ.1 కూడా అడగవద్దని అధికారులకు సూచించారు. పార్కు సుందరంగా తయారయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు వరికూటి ఓబుల్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, టౌన్ బ్యాంక్ ఉపాధ్యాక్షుడు మహ్మద్‌గౌస్, ప్రముఖ వైద్యులు జివిజి మహేష్, నాగార్జున, పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హతే ఆధారంగా పథకాల లబ్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని, అర్హతే ఆధారంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని ఆయన కోరారు. రోడ్డు భవనాల శాఖ అతిధి భవనంలో సోమవారం పార్టీ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, కల్లూరు నాగేంద్రారెడ్డి, రాజుపాలెం మండల ఉపాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి, ఎంపిపి సలోమి, జడ్‌పిటిసి అంజనీకుమారి, గోవర్ధన్, శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి నాగరాజు, గరిసెపాటి లక్ష్మీదేవి, అగ్గారపు శ్రీనివాసులు, కోనేటి సునంద, ఈశ్వర్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

దేశాభివృద్ధికి పల్లెసీమలే పట్టుగొమ్మలు

ఉత్తమ ప్రజాప్రతినిధికి అవార్డు అందిస్తున్న కలెక్టర్, జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - కడప

దేశ అభివృద్ధికి, ఆర్థిక ప్రగతికీ పల్లెసీమలే పట్టుగొమ్మలు అని గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి సర్పంచుల సేవలే ప్రామాణికాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. సోమవారం కడప జడ్‌పి ప్రాంగణంలోని డిపిఆర్‌సి భవన్‌లజిల్లా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, జడ్‌పి చైర్మన్ హాజరయ్యి సిస్థిర అభివృద్ధి లక్ష్య సాధనకు కృషి చేసిన పలువురు సర్పంచులకు సన్మానం, పురస్కార ప్రదానం చేశారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా పరిషత్ పరిధిలో మొత్తం 27 పంచాయతీలు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. అందులో 19 పంచాయతీలు వైఎస్ఆర్ జిల్లా, 8 పంచాయతీ అన్నమయ్య జిల్లా నుంచి ఎంపికయ్యాయి. ఆయా గ్రామ సర్పంచులు, సచివాలయ సెక్రెటరీలను జిల్లా, మండల పరిషత్ పరిధిలోని 39 మంది ఉద్యోగులను ముఖ్య అతిథులు ప్రశంసా పత్రాలు, శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాలకు అను గుణంగా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు అడుగులు వేస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రధాన ప్రామాణికం గ్రామ పంచాయతీలే అని చెప్పారు. గ్రామ సచివాలయాల్లో పరిపాలనా వ్యవస్థ పటిష్టంగా జరిగితేనే గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో అభివృద్ధి లక్ష్యం సాధ్యం అవుతుందని తెలిపారు. జడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రధానమైన ప్రజా ప్రతినిధులుగా విశిష్టమైన ప్రజా సేవలు అందించే అవకాశం సర్పంచులకు మాత్రమే దక్కుతుందని అభినందించారు. జిల్లాలో ఎక్కడైనా నీటి వనరు అవకాశం ఉన్న ప్రాంతాన్ని గుర్తిస్తే ఆ ప్రాంతం నుంచి నీటి సదుపాయం లేని ప్రాంతాలకు నీటి సదుపాయాన్ని కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసులురెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ. వీరన్న, డిఎల్‌పిఒలు, ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు. **కడప :** భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలకు మూలం పంచాయతీరాజ్ వ్యవస్థ అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం పంచాయతీరాజ్ వ్యవస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కళాశాల సమీపంలోని ప్రకాష్‌నగర్ గ్రామ సచివాలయాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే సందర్శించి, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు గ్రామ సచివాలయాల పనితీరు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అంకాల నాగరాజు, ఎన్‌సిసి అధికారి డాక్టర్ నీలయ్య, భూగర్భ శాస్త్ర విభాగ అధిపతి డా. రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **చెన్నూరు :** మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్.వి. నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండల సభాభవనంలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఉత్తమ పంచాయతీలకు సూపరింటెండెంట్ శకుంతల, పంచాయతీరాజ్ ఎఇ మురళీ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో శివాలపల్లి సర్పంచ్ నారాయణరెడ్డి, చెన్నూరు సర్పంచ్ వెంకటసుబ్బయ్య, బల సింగరాయపల్లి పల్లి పంచాయతీ సర్పంచ్ శుభ రత్నమ్మ. పంచాయతీ కార్యదర్శులు రామ సుబ్బారెడ్డి, శివారెడ్డి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడు :** గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఎంపిపి టి.లక్ష్మమయ్య తెలిపారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పంచాయతీ రాజ్ ప్రాముఖ్యత ముఖ్యమైందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :**రాష్ట్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన సర్పం చులను ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి, ఎంపిడిఒ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి మాట్లా డుతూ పంచాయతీ రాజ్ డే సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఎంపికైన సర్పం చులకు అవార్డు ప్రదానం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఖాదర్ బాషా, ఎంపిపి హరిత, గూడెంచెరువు సర్పంచు మజ్జారి నాగేశ్వర, గొరిగనూరు సర్పంచు మత్తయ్య, గండికోట సర్పంచు గురు ఈశ్వర్, దేవగుడి సర్పంచు ధర్మాపురంను సన్మానించారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :**గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గురుమోహన్ తెలిపారు. సోమవారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశానుసారం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురుమోహన్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యంతోనే దేశ సౌభాగ్యం ముడిపడి ఉందన్నారు.కార్యక్రమంలో సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **వేంపల్లె :** నందిపల్లె పంచాయతీకి పిల్లల స్నేహ పూర్వక విభాగంలో జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం 2023 ఏడాదికి సంబంధించిన ప్రతిభ అవార్డులను ఎంపిక చేశారు. నందిపల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ విజయ్ రామ రాజు చేతుల మీదుగా సర్పంచు మారం సులోచన ప్రతిభ అవార్డును అందుకున్నారు.

మోసం చేస్తున్న పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కొలతల్లో మోసాలకు పాల్పడుతున్న పెట్రోల్ బంకులపై తూనికల కొలతల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు సభ్యులు విజయ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మాస్టర్ పాయింట్ వద్ద సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జమ్మలమడుగు ప్రాంతంలో ఉన్న డీజిల్, పెట్రోల్ బంకుల్లో కొలతల్లో మోసాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జమ్మలమడుగు పాలిటెక్నిక్ కాలేజ్ వద్ద ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో మోసం బయట పడడంతో సిఐటియు ఆధ్వర్యంలో తీవ్ర నిరసన తెలిపామన్నారు. తూనికల, కొలతల అధికారులు వెంటనే పెట్రోల్ బంకులపై తనిఖీలు నిర్వహించాలన్నారు. పెట్రోల్ బంకుల్లో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే వాటి లైసెన్సులను రద్దు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సిఐ టియు నాయకులు ఆదాము, రాజు, ప్రసాద్‌రెడ్డి, స్వామి, మోష పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

శివాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

పోరెడ్డి సుజాతమ్మ వర్ధంతి సందర్భంగా పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శివాలయంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పోరెడ్డి నరసింహారెడ్డి కుటుంబసభ్యులు, వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

జిఒ నంబరు 38 హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రయివేటు పాఠశాలలకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపును మూడు నుంచి ఎనిమిదేళ్ల వరకు పొడిగిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నంబరు 38 హర్షణీయమని ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు బిఎస్ రమణారెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ జిఒ నంబర్ 38 విడుదల కోసం ప్రత్యేక చొరవ చూపిన ముఖ్యమంత్రి జగన్, సహకరించిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, విద్యా కమిషనరు సురేష్, ఎస్‌సిఇఆర్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. అలాగే ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మరింత సహకరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పతారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి ప్రైవేటు పాఠశాలల తరపున అభినందనలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూల ధోరణితో వ్యవహరించాలని ఆయన కోరారు.

పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువులకు సాధారణ, గర్భకోశ వ్యాధి చికిత్సలు, గర్భ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు పశు వైద్యాధికారి హిమబిందు తెలిపారు. మండలంలోని ఆరవేటిపల్లె గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా నీటి యాజమాన్య సహకారంతో పశు వైద్యాధికారి హిమబిందు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించామన్నారు. పశు పెంపకందారులకు మినరల్ మిక్చర్, లివర్ టానిక్ మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. డ్వామా టెక్నికల్ ఆఫీసర్ నరసింహ యాదవ్, వాటర్‌షెడ్ చైర్మన్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు మందు తాగిస్తున్న చేస్తున్న డాక్టర్ హిమబిందు

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

- ప్రొద్దుటూరు సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీనివాసులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దోమకాటు మలేరియా వ్యాధికి చోటు కల్పిస్తుందని, ప్రతి ఒక్కరూ దోమలు కు(పు)ట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొద్దుటూరు సబ్ యూనిట్ మలేరియా అధికారి సాధు శ్రీనివాసులు సూచించారు. ఇంట్లో ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. మంగళవారం అంతర్జాతీయ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శ్రీనివాసులు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. ఇంటిని, ఇంటి పరసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిలువ ఉంటే దోమలు పుడతాయన్నారు. రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలన్నారు. మలేరియా వ్యాధి పరాన్నజీవి వల్ల వ్యాపిస్తుందన్నారు. గతంలో ప్రొద్దుటూరు ప్రరిసర ప్రాంతాలైన పెన్నానగర్, రామేశ్వరంలో మలేరియా వ్యాధిగ్రస్తులు ఉంటేవారని, గతేడాది ఆయా ప్రాంతాల్లో 17కేసులు నమోదయ్యాయన్నారు. దోమజీవిత కాలం 52 రోజులు అని తెలిపారు. ప్రజలు చైతన్యవంతం కావడం వల్ల ఈ ఏడాది ఇప్పడి వరకు మలేరియా కేసు నమోదవ్వలేదన్నారు. ప్రజలను ఇంకా చైతన్యవంతం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో మలేరియా వ్యాధి పట్ల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించామన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ప్రజల్లో ఇంకా చైతన్యం పెరగాలని మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మెటీరియల్ అందజేస్తున్న సహాయ కమిషనర్ రంగస్వామి

ఉన్నత లక్ష్యాల కలను సాకారం చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కలలను సాకారం చేసుకునేందుకు నిబద్ధతతో కృషి చేయాలని మున్సిపల్ సహాయ కమిషనర్ రంగస్వామి తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక (జెవివి) కార్యాలయంలో పాలీసెట్ ఉచిత శిక్షణ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం పివిఆర్ ఇన్సిట్యూట్ చైర్మన్ రమణ సహకారంతో పాలిటెక్నిక్ మెటీరియల్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రంగస్వామి మాట్లాడుతూ జెవివి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. రమణ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగంలో పోటీ బలంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా నాయకులు మురళీ గుప్త, జెవివి ప్రదాన కార్యదర్శి సునీత, నాయకులు మధుసూధన్‌రెడ్డి, సూర్య నారాయణరెడ్డి, మాబువల్లి, అక్షిత, రాజేష్, ఆశ్రిత్, హేమలత, చెన్నయ్య పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అరాచక ప్రదేశ్‌గా మార్చారు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అరాచక ప్రదేశ్‌గా మార్చారని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం ఆయన పర్యటిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నల్లబోతుల నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు చింతకుంట బుద్ధిన్, సాన విజయభాస్కర్‌రెడ్డి, సరసుర శ్రీనివాసులు, 9వ వార్డు కరీముల్లా, గోపవరం గౌస్, భగత్ సింగ్ కాలనీ పట్నం మా బాషా, ఇర్ఫాన్, శివ, పగిడాల కన్నయ్య, పగిడాల మహేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి